సంస్కార హీనంగా
ప్రవర్తించబోయిన
అతడికామె
ఎలా బుద్ధి చెప్పింది?

# సంస్కారం

పి.సుజాతారాజు
కథ

ప్రొద్దుటే కళ్ళుతెరవడంతోటే "సుమా! కాఫీ" అంటూ కేకో, కలవరింతో తెలియ కుండా అరిచేసి మళ్ళీ ముసుగేసేసాడు మూర్తి.

కాస్సేపు ప్రశాంతంగా కూర్చుని వ్రా సుకుందాం అంటే ఎప్పుడు కుదరదు కదా! చేతిలో పెన్నూ, పేపర్స్ విరాగ్గా కుర్చీలో పడేసి లేచింది. కాఫీ కలపడానికి. ఆ తరువాత 4 గం. వరకూ వంటగదిలోంచి బయటకు రావడానికి కుదరలేదు సుమకు. ఆఫీసుకు వెళ్ళడానికి తయారవుతూ యథా లాపంగా కుర్చీవైపు చూసిన మూర్తి కళ్ళు పెద్దవై ఆ కాగితాలను చేతిలోనికి తీసుకొని చదివి అదిరిపోయి మళ్ళీ చదివాడు.

"మనస్సును నొక్కిపట్టితే భావాలు బద్దలై
నట్టు
నన్ను అదిమిపెట్టినప్పుడు వత్తిడి తట్టుకోలే
ని
గోడ మాడు ఎలా గొల్లుమంది"

"నేనెప్పుడు గోడకి అదిమి పట్టాను?" జ్ఞాపకం తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూనే ఆఫీసుకు బయలుదేరాడు.

వెడుతూ, వెడుతూ సుమ కోసం చూస్తే పక్కింటి కుర్రాడు వంద్రదంతో ప్రొద్దుటే వ్రాసాను అంటున్న మాటలు వినిపించాయి. మనస్సులో అనుమాన బీజం నాటుకోగా సుమకు చెప్పకుండానే బయట కు వచ్చేసాడు మూర్తి.

స్కూటర్పై వెడుతున్నాడే కాని ఆలో చిస్తూనే ఉన్నాడు మూర్తి. ఇంట్లో అప్పుడ ప్పుడూ ఇలాంటి కవితలు వ్రాసిన కాగితాలు టేబుల్పైన బీరువాల్లోను కన్పించడం మా మూలే కాని అవన్నీ తనగురించి వ్రాసినవే



అనుకున్నాడు కానీ అయితే ఇది వేడి ప్రభావమన్న మాట ఏదో ఫ్రీగా మాట్లాడుతుంటే ఫరవాలేదనుకున్నాడే కాని అమ్మో ఇంక ఆలోచించలేకపోయాడు. ఆఫీసులో కూడా అన్యమనస్కారంగానే ఉన్నాడు. ఇంటికి వస్తుంటే కొరీగ్ బలవంతంగా సినిమాకు లాక్కుపోయాడు ఎంత రానని చెప్పినా విన్పించుకోకుండా.

సాయంత్రం ఆరున్నర ఏడు ప్రాంతంలో పక్కింటి చంద్రం వచ్చి కూర్చుంటూనే అడిగాడు. ఏదండీ మీరు ప్రొద్దుట వ్రాసిన గేయం అని. తెస్తా నుండండి అని లోపలికెళ్ళి రెండు పేపర్స్ తెచ్చి ఇచ్చింది సుమ. చదువుతుంటే ఎన్నాళ్ళుగానో చంద్రం మనస్సులోని కోరిక బయటకు వస్తోంది. ఇలాంటి కవితలు నాకు చూపిస్తోంది అంటే నేనంటే ఇష్టమున్నట్టే కదా! లేకపోతే నాకెందుకు చూపిస్తుంది అనుకుంటూ మళ్ళీ చదివాడు.

"పెదవి ఎరుపు లోంచి జారే అమృత
ధారలో
చిక్కని చిక్కని చేద్దామనుకుంటే
వెల్లువయ్యే తాకిడికి తట్టుకోలేనని భయమేసి
ంది!
మరిగి చూసేసరికి తుర్రుమన్నావు"

"ఎలా ఉంది చంద్రం" కాఫీ కప్పు చేతికందిస్తూ అంటున్న సుమ మాటలు విని ఈ లోకంలోకి వచ్చాడు.

"చాలా బావుందండీ. నిజంగా మూర్తి గారి అదృష్టం తలుచుకుంటే నాకు అసూయగా కూడా ఉంది" అన్నాడు.

"ఏం లాభం. నేనెలా వ్రాసినా ఆయన పట్టించుకోరు. ఎప్పుడైనా బలవంతంగా చదివించినా బావుందని కానీ, బాగ్లేదని కానీ చెప్పరు. చదివి ఓ నవ్వు నవ్వేస్తారు. అదే నా బాధ. ఆయన దగ్గరనుంచీ ప్రోత్సాహం ఉంటేనా ఎంత బావుండును అనుకుంటాను. అందుకే మీకు చూపిస్తాను. మీకు ఎలాగూ సాహిత్యమంటే ఇష్టమేగా. మీకైనా అర్థమవుతాయి. కనీసం ఒక్కరైనా చదివి అర్థం చేసుకున్నారన్న తృప్తి మిగులుతుంది అంతే. ఆయన చదివి అర్థం చేసుకుంటారన్న ఆశ ఎలాగూ లేదు" ఇంకా ఏదో చెబుతూనే ఉంది సుమ.

ఇవేమి చంద్రానికి వినిపించడంలేదు. సుమనే చూస్తున్నాడు. కొత్తగాకనిపిస్తోంది. రోజుకంటే అందంగా కనిపిస్తోంది. ఇంతకంటే ఏ ఆడది మాత్రం మనస్సు విప్పి మాట్లాడుతుంది. మనస్సు తొందర పెడుతుంటే ఏం చేయాలా అని ఆలోచిస్తూ అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు.

"చంద్రం ఇలా రండి నేను ఓ చిన్న బొమ్మ వేసాను ఎలా ఉందో చూసి చెప్పండి" అంటూ బెడ్‌రూమ్‌లోకి దారి తీస్తుంటే కలలోలా నడిచాడు.

రాధా కృష్ణుల బొమ్మ అద్భుతంగా ఉంది. ఎందుకనో అలిగిన రాధను చుబుకం పట్టుకుని బ్రతిమాలుకుంటున్నాడు కృష్ణుడు.

"అబ్బ కృష్ణుడ నేనైతే ఎంత బావుండును. అప్రయత్నంగా కాదు" కావాలనే అన్నాడు.

"అంత కోరికగా ఉంటే తొందరగా పెళ్ళి చేసుకోవయ్యా అన్నీ ముచ్చట్లు తీరుతాయి" మనోహరంగా నవ్వుతూ అంది.

ఆ నవ్వు మరింత ధైర్యాన్నిచ్చింది చంద్రానికి. చేతివేళ్ళు కావాలని తగిలించినా అభ్యంతరం చెప్పకపోయేసరికి మనస్సులో కోరిక అణుచుకోలేక మెల్లిగా ధైర్యంతో వెనుకనుండి వచ్చి వాటేసుకున్నాడు.

ఆమె తృళ్ళిపడి వెనక్కు తిరిగే కంగారులో ఇద్దరు కలిసి మంచంపై పడ్డారు.

మూర్తి సినిమా చూస్తున్నాడే కాని

ధ్యాసంతా ఇంటిపైనే. వాళ్ళిద్దరి చుట్టూనే ఆలోచనలు. తెరపై సినిమా నడుస్తూనే ఉంది. ఆ సినిమాలో ఓ పురుష పుంగవుడు భార్యతో అవసరం తీరిపోయాక ప్రక్కకు జరిగి మొఖం తిప్పుకుంటే ఆ భార్య ఆవేదనను క్లోజప్‌లో చూపిస్తున్నాడు దర్శకుడు. ఆ టైమ్‌లో ఎన్ని మోచేతులొచ్చి భర్తల్ని పొడిచాయో ఆ కుర్చీలకు, థియేటర్‌కి మాత్రమే తెలుసు. అలాంటి మోచేయి ఒకటి పొరబాటున వచ్చి మూర్తికి తగిలేసరికి త్రుళ్ళిపడి ఈ లోకంలోకి వచ్చాడు. తను ఆలోచిస్తున్నది, తెరపై జరుగుతున్నది ఒకటే కాబట్టి, అందున చంద్రం చేసుకొనే అమ్మాయి చాలా అదృష్టవంతురాలండి సుమ మాటలు గుర్తు రావడంతో ఇక థియేటర్‌లో కూర్చోలేక ప్రక్కనున్న ఫ్రెండ్‌కి చెప్పాలన్న ఆలోచనైనా లేకుండా లేచి వచ్చేసాడు. అతను ఇంటికి వచ్చి గేట్ తీసుకొని లోపలికి వచ్చేసరికి ఇద్దరు కలిసి మంచంపై పడడం లీలగా కిటికీలోంచి కన్పించింది మూర్తికి. తన అనుమానం నిర్ధారణ చేసుకోవడం కోసం కిటికీలోంచి తొంగిచూసాడు. ఏహ్య భావంతో వెనక్కి తిరిగేలోపు మాటలు విన్పించాయి స్పష్టంగా

''సుమగారూ'' కళ్ళు మూసుకొని పరవశించి పోతున్నాడు.

''ప్లీజ్ కాదనకండి. ఎన్నాళ్ళుగానో'' చంద్రం మాటలు పూర్తవ్వలేదు.


''ఒక్క నిముషం చంద్రం'' అని సుమ సున్నితంగా తప్పుకొని లేచి కూర్చుంది.

అతన్ని ఒక్కసారి ఎగాదిగా చూసి సూటిగా అడిగింది. ''నాపై ఇలాంటి కోరిక ఎన్నాళ్ళ నుండి ఉంది నీలో''

అడిగినదానికి సమాధానం చెప్పకుండా ''మీకూ ఇష్టమేమో అనుకున్నాను'' అన్నాడు చంద్రం.

ఆమె చివ్వున తల ఎత్తి ''నేనెప్పుడైనా అలా బిహేవ్ చేసానా!'' అని అడిగింది.

''మరి మీరు వ్రాసిన ప్రతిది నాకెందు



పు చూపించారు. నా వ్యక్తిత్వాన్ని మావారు ఎప్పుడు పట్టించుకోరు అని నాకెందుకు చెప్పారు". బింకంగానే అన్నాడు చంద్రం.

భర్త గురించి పరాయి మనిషికి చెప్పడం వల్ల తప్పేమిటో అర్థమయ్యి సన్నని బాధ పిదిన కదలంగా అతనికి సమాధానం చెప్పింది.

"నా వ్యక్తిత్వాన్ని పట్టించుకోరని చెప్పాను కాని నన్ను పట్టించు కోరని నేనెప్పుడూ చెప్పలేదే". ఇక నేను వ్రాసిన ప్రతీదీ మీకెందుకు ఆపాదించానంటారా! చదువుంది కదా! సంస్కారం కూడా ఉంటుందనుకున్నాను. కానీ ఇలాంటి ఆలోచనలతో ఉన్నారని తెలిస్తే నేనసలు మాట్లాడక పోయేదాన్ని. మీతో అంత చనువుగా ఉండకపోయేదాన్ని. అసలు ఒక ఆడది కొంచెం ఫ్రీగా మాట్లాడితే అవిధంగానే ఎందుకర్థం చేసుకుంటారు. మీ మగవాళ్ళు. నా భర్త నీలాగ సంస్కార హీనుడు కాదు. ఇందాక మనం మంచంపై ఉన్నప్పుడు చూసినా నన్ను అపార్థం చేసుకో కపోను. అంత ఉన్నత వ్యక్తిత్వం ఉన్న మనిషి నా భర్త" ఆవేశంగా అనేసి ఊపిరి పీల్చుకోవడానికి ఒక నిముషం ఆగింది.

కిటికి దగ్గర పొంచి మాటలు వింటున్న మూర్తికి మనస్సుపై చెక్కున పరిచినట్లయింది. తన పత్ని ఔన్నత్యానికి తనే సిగ్గుపడిపోయాడు. ఇంతలో సుమ మాటలు వినిపించాయి.

"సరే జరిగిందేదో జరిగిపోయింది. తప్పు మీదో నాదో చర్చించడం అనవసరం. ఇకముందు ఇలాంటి ఆలోచనలతో నా ఇంట్లోకి అడుగు పెట్టవద్దు. మీ మనస్సు మారితే ఎప్పటిలాగే మనం ఫ్రెండ్స్ సరేనా!" నవ్వుతూనే అంది.

పశ్చాత్తాపంవల్ల బరువైన తలను ఎత్తకుండానే చెప్పాడు "అయాం సారీ సుమగారు" అని. ఇట్స్ ఓకె.

"పరీక్షలకు బాగా ప్రిపేరవ్వండి మనస్సు పాడు చేసుకోకుండా" అంది సుమ.

"ఈ విషయం మూర్తిగారికి" మధ్యలోనే ఆపేసాడు చంద్రం.

"చెప్పనులే వెళ్ళండి" అని సాగనంపడానికి గుమ్మంవరకూ వచ్చేసరికి మూర్తి ఎదురైయ్యాడు మనసారా నవ్వుతూ.

*

